

యువతకు బాసట

రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రూ.4లక్షల వరకు సబ్సిడీ రుణం అందించనుంది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:23	ఆది : 5:02

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /23.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- సీపీ అంబర్ కిశోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై శుక్రవారం రామగుండం కమిషనరేట్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర రహదారులు, ఇతర రహదారులపై 2022–24 మధ్య జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు, మృతులు, కారణాలు, తీసుకున్న చర్యలు, బ్లాక్‌స్పాట్ గుర్తింపు తదితర అంశాలపై ట్రాఫిక్, పోలీస్ అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బ్లాక్ స్పాట్స్, రోడ్డు ప్రమాదాలపై పవర్ గూగుల్ మ్యాపింగ్ ద్వారా వివరించారు. సీపీ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్పీడ్ బ్రేకర్లు, తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రఘువేంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్, సివిల్ పోలీస్ అధికారులు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రైల్వేగేటు తెరుచుకుంది..

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటును శుక్రవారం తెరిచారు. రైల్వేట్రాక్ మరమ్మతుల కారణంగా ఈ నెల 19 నుంచి 28 వరకు పది రోజులపాటు గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో వారు సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడి గేటును శుక్రవారం తాత్కాలికంగా తెరిపించారు.

స్క్రైబ్ సహాయంతో పరీక్షకు అంధులు



విద్యార్థులు శ్రీవిద్య, శ్రీమాన్

తాండూర్: ఆ విద్యార్థుల ఆత్మస్థైర్యం ముందు అంధత్వం చిన్నబోయింది. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనే వారి దృఢ సంకల్పం ముందు విధి తలవంచింది. మండల కేంద్రంలోని విద్యాభారతి పాఠశాలలో గౌతూరి శ్రీవిద్య, తంగెడ శ్రీమాన్ పదో తరగతి చదువుతున్నారు. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన శ్రీమాన్, తాండూర్ కొత్త గుడిసెల ఏరియాకు చెందిన శ్రీవిద్య 70శాతం అంధత్వానికి లోనయ్యారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల వినతి మేరకు స్క్రైబ్(సహాయకుల) సహాయంతో పరీక్షలకు హాజరయ్యేందుకు జిల్లా ఉన్నతాధికారులు అనుమతించారు. శ్రీమాన్‌కు విద్యాభారతి పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని మైలారపు తరుణి, శ్రీవిద్యకు మరో తొమ్మిదో తరగతి విద్యార్థిని పట్టి ప్రణవి స్క్రైబ్‌గా హాజరయ్యారు. దీంతో శుక్రవారం తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో తొలి రోజు పరీక్షకు హాజరై స్క్రైబ్‌ల సహాయంతో రాశారు. తనిఖీకి వచ్చిన డీఈవో యాదయ్య ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు అడిగి శ్రీమాన్, శ్రీవిద్య చెప్పిన సమాధానాలతో అభినందించారు.

తెలంగాణ క్షేత్రాలు-అక్షర దర్శనం సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ క్షేత్రాలు–అక్షర దర్శనం అనే అంశంపై జాతీయ సదస్సు ప్రారంభమైంది. రెండ్రోజులపాటు సదస్సు నిర్వహిస్తారు. 35 మంది పరిశోధకులు పత్రాలను సమర్పించారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల క్షేత్రాలపై పత్రాలను సమర్పించారు. రెండో రోజు శనివారం నాలుగు సెషన్లు కొనసాగనున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రామకృష్ణ, ఆచార్య సంగనభట్ల నర్సయ్య, గండ్ర లక్ష్మణ్‌రావు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, సదస్సు సంచాలకుడు శ్రీధర్ హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇక పత్తి ప్రైవేటుకే..!



జిన్నింగ్ మిల్లులో సీసీఐకి పత్తి విక్రయం(ఫైల్)

- జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఎత్తివేత
- అనేక అవస్థల మధ్య విక్రయించిన రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట సేకరణ ముగిసింది. మూడు వ్యవసాయ మార్కెట్ యార్డుల పరిధిలోని కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఎత్తివేసింది. సీసీఐ చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఐదు జిన్నింగ్ మిల్లులు, బెల్లంపల్లి మార్కెట్ పరిధిలో రెండు, లక్సెట్టిపేట మార్కెట్ పరిధిలో ఒకటి మొత్తం ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. గత నవంబర్ రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఈ నెల మొదటి వారం నుంచి ఎత్తివేసింది. ఆలస్యంగా సాగు చేసిన, కూలీల కొరత కారణంగా ఇంకా అమ్మకుండా రైతుల వద్ద నిల్వ ఉన్న పత్తిని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. సీసీఐ 30,050 మంది రైతుల నుంచి రూ.564,14,90,798 విలువైన 8,95,859 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసింది. ప్రారంభంలో తేమ శాతం 8 వచ్చిన పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 చొప్పున చెల్లించింది. ఆ తర్వాత తేమ తిరకాసు, దూది పింజ పొడవు, నాణ్యత పరిమాణాలతో మద్దతు ధరలో కోత విధిస్తూ రూ.7,120 నుంచి రూ.7,400 చెల్లింపులు చేసింది. దీంతోపాటు జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు పేరుకుపోవడం తదితర కారణాలతో తరచూ సీసీఐ పత్తి సేకరణ నిలిపివేయడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదే అదునుగా భావించి ప్రైవేటు వ్యాపారులు రూ.6,500 నుంచి రూ.7000 వరకు చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఈ సీజన్‌లో ప్రైవేటు వ్యాపారులు 10,256 మంది రైతుల నుంచి 1,37,783 క్వింటాళ్లు కొనుగోలు చేశారు.

తరచూ నిలిపివేత

జిల్లాలో 1.57 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 12 నుంచి 13లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఆలస్యంగా సాగు చేయడంతో డిసెంబర్‌లో దిగుబడి వచ్చింది. జనవరిలో కొనుగోలు కేంద్రాల వద్ద పత్తి వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. సంక్రాంతి పండుగ నుంచి పత్తి పోటెత్తడంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను నిలిపివేసింది. పది రోజుల పైగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఆందోళనలు చేపట్టారు. కొందరు గత్యంతరం లేక దళారులకు విక్రయించారు. సీసీఐ తరచూ కొనుగోలు కేంద్రాలు నిలిపివేయడంతో రైతులు అవస్థలు పడ్డారు. మద్దతు ధర లభిస్తుందని వస్తే రోజుల తరబడి పడిగాపులతో వాహనాలకు అద్దె చెల్లించాల్సి రావడంతో ఆర్థిక భారం పడింది. ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు, ఎన్నో అవస్థల మధ్య రైతులు సీసీఐకి పత్తి విక్రయించారు.

అక్రమాల ఆరోపణలు..

కౌలు రైతులు వ్యవసాయ అధికారుల నుంచి కౌలు ధ్రువీకరణ పత్రం, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ద్వారా టీఆర్(టెంపరరీ రిజిస్టర్) పత్రం ఉంటేనే సీసీఐ కొనుగోలు చేసింది. టీఆర్ పత్రాల జారీలో అక్రమాలు చోటు చేసుకోవడంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి చెన్నూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఇతర జిల్లాలు, పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి దళారులు పత్తి తీసుకొచ్చి విక్రయించారనే ఆరోపణలు వచ్చాయి. ఒక్క చెన్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలోనే టీఆర్ పత్రాల అక్రమాల ద్వారా రూ.80 లక్షల విలువైన పత్తి విక్రయాల్లో తేడా వచ్చినట్లు తెలుస్తోంది.

ఇంకా అందని నగదు..



సీసీఐ 30,050 మంది రైతుల నుంచి 8,95,859 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసింది. రూ.564,14,90,798 చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 26,211 మందికి రూ.495,30,24,807 ఖాతాల్లో ఫిబ్రవరి 28 వరకు నగదు జమ చేసింది. ఇంకా చెన్నూర్, లక్సెట్టిపేట పరిధిలోని 3,839 మంది రైతులకు రూ.68,84,65,991 అందాల్సి ఉంది. గత డిసెంబర్, జనవరిలో విక్రయించిన పత్తికి సైతం నగదు రాలేదని రైతులు వాపోతున్నారు. చెన్నూర్ మార్కెట్ కమిటీ కార్యాలయానికి నెలల తరబడి తిరుగుతున్నారు. ఆలస్యం చేయకుండా నగదు పడేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తి

మార్కెట్ కమిటీ	సీసీఐ	ప్రైవేట్	మొత్తం
లక్సెట్టిపేట	78,196	1,449	79,645
చెన్నూర్	3,75,963	96,661	4,72,624
బెల్లంపల్లి	3,03,917	39,673	3,43,590
మొత్తం	7,58,076	1,37,783	8,95,859



ఈత కొలనులేవి..!



బెల్లంపల్లి బుధాగెస్ట్ హౌజ్‌లో మూసివేసిన సింగరేణి ఈత కొలను

- మున్సిపాల్టీల్లో పాలకుల అశ్రద్ధ
- ప్రతిపాదనలకూ నోచుకోని వైనం

బెల్లంపల్లి: వేసవి వచ్చిందంటే చాలు పిల్లలు, పెద్దలు సరదాగా ఈత కొట్టాలని చూస్తుంటారు. కానీ జిల్లాలోని మున్సిపాల్టీల్లో ఈతకొలనులు లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈత కొలనుల ఆవశ్యకతపై పాలకులు, ప్రభుత్వ అధికారులు శ్రద్ధ చూపకపోవడం పట్టణ ప్రజలకు శాపంగా మారింది. ఆటవిడుపు, ఆరోగ్యం కోసం పట్టణాల్లో పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసినా ఈత కొలనులపై పట్టింపు కరువైంది. మున్సిపాల్టీలుగా మారిన కోల్‌బెల్ట్ పట్టణాల్లో మాత్రం సింగరేణి పరంగా ఈత కొలనులు ఏర్పాటయ్యాయి. మున్సిపాల్టీల్లో ఈత కొలనుల నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ ఉన్నా కార్యరూపం దాల్చకపోగా కనీసం ప్రతిపాదనలకు నోచుకోవడం లేదు.

జిల్లాలో..

జిల్లాలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, బెల్లంపల్లి, మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట మున్సిపాల్టీలు ఉన్నాయి. ఆయా మున్సిపాల్టీల్లో ప్రభుత్వ నిధులతో ప్రజల సౌకర్యార్థం ఈతకొలనులు నిర్మించాల్సి ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ఈతకొలనులు లేక ఈత నేర్చుకోవాలనే ఆసక్తి సన్నగిల్లుతోంది. సింగరేణి డీఎంఎఫ్‌టీ, మున్సిపల్, ఇతర ప్రభుత్వ నిధులతో ఈత కొలనులు నిర్మించడానికి అవకాశం ఉన్నా ఆ దిశగా అడుగులు పడడం లేదు.

పారిశ్రామిక పట్టణాల్లో..

మున్సిపాల్టీగా ఏర్పడిన పారిశ్రామిక పట్టణాల్లో సింగరేణి యాజమాన్యం ఈతకొలనులు నిర్మించింది. బెల్లంపల్లి, మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల్లో, మంచిర్యాల కార్పొరేషన్ పరిధి నస్పూర్‌లో సింగరేణి ఈత కొలనులు ఉన్నాయి. బెల్లంపల్లి బుధాగెస్ట్‌హౌజ్‌లో ఈతకొలనును బొగ్గుగనులు మూతపడిన క్రమంలో ఏళ్ల క్రితం సింగరేణి యాజమాన్యం మూసివేయగా మిగతా ప్రాంతాల్లో యథావిధిగా కొనసాగుతున్నాయి. వీటిలో బొగ్గు గనుల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఈత నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నారు. నిర్ణీత ఫీజు వసూలు చేసి అత్యల్ప సంఖ్యలో కార్మికేతరులను అనుమతిస్తున్నారు. నెలకు సింగరేణి ఉద్యోగుల నుంచి రూ.100, డిపెండెంట్ల(పదేళ్ల లోపు చిన్నారులు)కు రూ.50, 18ఏళ్లలోపు వారికి రూ.70, పెద్దలకు రూ.100, ఇతరుల వద్ద నుంచి రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారు.

ఆసక్తి ఉన్నా.. అవకాశం సున్నా..

ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, వేసవి తాపం నుంచి శరీరాన్ని రక్షించుకోవడానికి ఈతకొట్టడం అద్భుతమైన ప్రక్రియ. రన్నింగ్, వాకింగ్ చేయడం, జిమ్‌కు వెళ్లడం కన్నా స్విమ్మింగ్ చేయడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో చిన్నా పెద్దా, ఆడామగ తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఈత నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నా అవకాశాలు లేవు. పుర ప్రజల అవసరాల దృష్ట్యా అనువైన స్థలాలను ఎంపిక చేసి ఈతకొలనుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆ ప్రస్తావన తేలేదు



స్విమ్మింగ్‌పూల్ నిర్మించాలనే ప్రస్తావన ఇంతవరకు ఎవరూ మున్సిపల్ దృష్టికి తీసుకు రాలేదు. గత ఐదేళ్లలో ప్రజాప్రతినిధులు ఎవరూ ప్రతిపాదించలేదు. సమావేశాల్లోనూ చర్చించలేదు. అదే తీరుగా నిధులు, స్థల సమస్య కూడా ఉంది. ఓపెన్ జిమ్‌ల మాదిరిగా స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం చేయ డం మంచిదే అయినా ప్రతికూల పరిస్థితుల్లో ముందుకు వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు.

– కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి



దండేపల్లి: గూడెంలో కురిసిన వడగండ్లు



దండేపల్లి: లింగాపూర్ శివారులో నేలవాలిన మొక్కజొన్న

వడగండ్ల వాన బీభత్సం

దండేపల్లి/లక్సెట్టిపేట/కాసిపేట/జైపూర్/మందమర్రిరూరల్/భీమిని: జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. దండేపల్లి మండలంలో చిరుజల్లులతో మొదలై ఒక్కసారిగా వడగండ్లు పడ్డాయి. భారీగా వడగండ్లు పడడంతో ప్రజలకు బయటకు వెళ్లలేకపోయారు. లింగాపూర్ గ్రామ శివారులో పాల్తే రతిలాల్‌నాయక్‌కు చెందిన ఎనిమిది ఎకరాల్లోని మొక్కజొన్న నేలవాలింది. లక్సెట్టిపేట పట్టణంలో, మండలంలోని వెంకట్రావుపేట, జెండావెంకటాపూర్ గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. కొత్తూరు గ్రామంలో వరి నేలవాలి నష్టం వాటిల్లింది. కాసిపేట, జైపూర్, మందమర్రి, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో వాతావరణం చల్లబడి తేలికపాటి వర్షం కురిసింది. పలు గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి. అధిక ఎండలతో నీరు అడుగంటుతున్న క్రమంలో కురిసిన వర్షం వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు కొంత మేలు చేసింది.

ఆలస్యంగా పరీక్ష



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

- మంచిర్యాలలోని ఓ కేంద్రంలో తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం
- రెండు గంటల సమయం వృథా
- ఆ మేరకు సమయం పొడగింపు
- ఆందోళనకు గురైన తల్లిదండ్రులు
- జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం సీఎస్, డీవోల సస్పెన్షన్
- జిల్లాలోని మిగతా కేంద్రాల్లో ప్రశాంతం



పరీక్ష కేంద్రం పరిశీలించి వస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, పక్కన డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో తొలి రోజు శుక్రవారం గందరగోళం ఏర్పడింది. ఓ పేపర్ ప్రశ్నపత్రాల బాక్సుకు బదులు మరో పేపర్ బాక్స్ తీసుకు రావడంతో రెండు గంటలు ఆలస్యంగా పరీక్ష మొదలైంది. ఈ సంఘటన మినహా జిల్లాలోని మిగతా 48 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 9,183 మంది విద్యార్థులకు గాను 9,163మంది పరీక్షకు హాజరయ్యారు. నిర్దేశిత సమయానికి ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోపలికి అనుమతించారు. విద్యార్థులు చేతి గడియారాలు వెంట తెచ్చుకోగా.. కొన్నిచోట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాల సిబ్బందితోపాటు తనిఖీలకు వచ్చిన స్క్వాడ్ సెల్‌ఫోన్లు కూడా బయటనే ఉంచారు.

ఇక్కడ గందరగోళం..

జిల్లా కేంద్రం మంచిర్యాలలో తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో సంబంధిత అధికారులు తెలుగు పేపర్ బాక్సుకు బదులు హిందీ పేపర్ బాక్స్ తీసుకు రావడంతో గందరగోళానికి దారి తీసింది. ఈ నెల 10న హైదరాబాద్ నుంచి కాటన్ బాక్సుల్లో ప్రశ్నపత్రాలు డీఈవో కార్యాలయానికి చేరగా రూట్ అధికారులతో పోలీసుస్టేషన్లకు తరలించారు. ఆయా పోలీసుస్టేషన్లలో సీఎస్, కస్టోడియన్, డీవోల సమక్షంలో ట్రంక్ బాక్సుల్లో ప్రశ్నపత్రాలు భద్రపర్చారు. మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంకు సంబంధించిన డే–1 ప్రశ్నపత్రం తీసుకురావాల్సి ఉండగా డే–2 ప్రశ్నపత్రం పార్సిల్ తీసుకొచ్చారు. వెంటనే పొరపాటును గుర్తించిన సీఎస్, డీవోలు పార్సిల్ తెరవకుండానే జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌కు సమాచారం అందించారు. కలెక్టర్ కుమార్ దీపక్, డీఈవో యాదయ్య పరీక్ష కేంద్రానికి చేరుకుని అక్కడి నుంచి పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. పేపరు పార్సిల్ మారిన విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి తెలుగు ప్రశ్నపత్రం పార్సిల్ మార్చే క్రమంలో సమయం గడిచిపోయింది. ఉదయం 9.30గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్ష 11.30 గంటలకు ప్రారంభమైంది. ప్రశ్నపత్రంపై విద్యార్థులు ప్రశ్నించగా.. తెలుగు పేపర్‌లో ఎర్రర్ వచ్చిందంటూ ఇన్విజిలేటర్లు సర్ది చెప్పినట్లు తెలుస్తోంది. పరీక్ష ఆలస్యం కావడంతో స్నాక్స్, తాగునీరు అందించారు. పరీక్ష సమయాన్ని మరో రెండు గంటలు పొడిగించారు. పరీక్ష ముగిసే సమయం 12.30గంటలకు చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందారు. మరో పశ్నపత్రం తీసుకు రావడం, మార్చడానికి ఆలస్యమైందని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఎండల నేపథ్యంలో ఒంటిపూట బడులు నిర్వహిస్తుండగా.. పది పరీక్ష కేంద్రాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్నం తరగతులు కొనసాగుతున్నాయి. ఈ పరీక్ష కేంద్రంలో ఆలస్యం కావడంతో విద్యార్థులకు సెలవు ప్రకటించారు.

పేపర్ లీక్ అవాస్తవం : కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష 2గంటలు ఆలస్యంగా ప్రారంభమైందని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ప్రశ్నపత్రాలు ఆఖరి క్షణం వరకు ఎవరికి తెలియదని, ట్రంక్ బాక్సును గుర్తించి రెండో రోజు పరీక్ష ప్రశ్నపత్రాలు తెరువలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సీల్‌తో పోలీసుస్టేషన్‌లో భద్రపర్చామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, ప్రశ్నపత్రం లీక్‌లో నిజం లేదని తెలిపారు. పరీక్షా సమయం వృథా, విధుల్లో నిర్లక్ష్యం వహించిన పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సఫ్దర్‌అలీఖాన్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ పద్మజను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. వీరి స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగించామని తెలిపారు.

సీఎం రాకకు ఏర్పాట్లు



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఏసీపీ వెంకటేశ్వర్, ఈడీ శ్రీనివాసులు

- జైపూర్‌లో మూడో యూనిట్‌కు శంకుస్థాపన
- ఇంకా అధికారికంగా ఖరారు కాని షెడ్యూల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో ఉన్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్(ఎస్టీపీపీ) ఆవరణలో సింగరేణి సంస్థ కొత్తగా నిర్మించనున్న 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ యూనిట్‌కు శంకుస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. మొదట ఈ నెల 23న సీఎం పర్యటన ఉంటుందని జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఆ మేరకు ప్లాంట్ సింగరేణి, పోలీసులు, స్థానిక అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇంకా అధికారికంగా షెడ్యూల్ ఖరారు కాలేదు. గతంలోనే మూడో యూనిట్ నిర్మాణం చేపట్టాలని సింగరేణి నిర్ణయం తీసుకుని, పనులు ప్రారంభించాలని ప్రణాళికలు వేసింది. నేటికీ సీఎం పర్యటన ఖరారు కాకపోవడంతో సింగరేణి అధికారులు ఎదురు చూస్తున్నారు. రూ.6700 కోట్లతో చేపడుతున్న కొత్త ప్లాంటు నిర్మాణానికి సంబంధించి టెండర్లు పూర్తయి అంతా సిద్ధమైంది. అధికారికంగా పనులకు శంకుస్థాపనే మిగిలింది. గత పదేళ్లుగా ఇక్కడ మూడో యూనిట్ ప్రారంభం చేయాలని ప్రణాళిక వేసినా, సాంకేతిక కారణాలతో తాత్సారం జరుగుతోంది. తాజాగా సీఎం పర్యటన ఖరారైతే మోక్షం కలగనుంది.

అనుకూలించని వాతావరణం

సీఎం పర్యటనకు బీజీ షెడ్యూల్‌తోపాటు హెలికాప్టర్‌లో రాకపోకలు సాగించేందుకు వాతావరణం అనుకూలత లేకపోవడం ఓ కారణంగా కనిపిస్తోంది. గత రెండ్రోజులు వాతావరణ పరిస్థితులు మారిపోవడంతో హెలికాప్టర్ ప్రయాణానికి అసౌకర్యం ఏర్పడుతున్నట్లు తెలిసింది.

పరిశీలించిన అధికారులు

జైపూర్: అధికారికంగా సీఎం పర్యటన వివరాలు వెల్లడించకపోయినా శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివా స్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో కలిసి ఎస్టీపీపీలో కొత్త ప్లాంటు ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. హెలీప్యాడ్ ప్రాంతం, కొత్త ప్లాంటు నిర్మాణం కోసం ఏర్పాటు చేస్తున్న స్తూపం సందర్శించారు. అనంతరం ప్రాణహిత అతిథి గృహంలో ఎస్టీపీపీ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

క్లుప్తంగా

23న రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

భైంసాటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 23న పూర్వ ఆదిలాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెస్రం బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. గతప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతోపాటు రెవె న్యూ సంఘాల వైఫల్యంతో రెవెన్యూశాఖ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. అన్నిశాఖలను భా గస్వామ్యం చేసుకుని పనిచేసే రెవెన్యూ శాఖ ను పరిరక్షించుకునేందుకు టీజీఆర్ఎస్ఏ కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెవె న్యూ ఉద్యోగుల మధ్య ఐక్యత, ఆత్మీయ తను పెంపొందించేందుకు రాష్ట్ర నాయకత్వం లో రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పా టు చేస్తోందన్నారు. కాగా మంచిర్యాల లో పూర్వ ఆదిలాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యో గుల ఆత్మీయ సమ్మేళనానికి జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

23న ప్రజాఫ్రంట్ మహాసభలు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మూడో మహాసభలను ఈనెల 23న మంచిర్యాలలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ టి. జైపాల్‌సింగ్, ప్రజాకళామండలి జిల్లా అధ్యక్షుడు ఆడేపు సమ్మయ్య తెలిపారు. శుక్రవారం బెల్లంప ల్లిలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభ లకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కాంగ్రె స్ ప్రభుత్వం ఏడాదిలో బీఆర్ఎస్‌ను మించి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని మండిపడ్డారు. కాగా మంచిర్యాల చార్వాక ట్రస్ట్ భవన్‌లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ప్రజాఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ ఆర్.నాగభూషణం, రాష్ట్ర కోక న్వీనర్‌లు సంజీవరావు, అంబన్న హాజరవు తారని వివరించారు. కార్యక్రమంలో ప్రజా ఫ్రంట్ నాయకులు బోగే పోశం, జాడి చం ద్రయ్య పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జైలు

ఖానాపూర్: బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జైలుశిక్ష పడినట్లు ఎక్సైజ్ సీఐ రంగ స్వామి, ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణానికి చెందిన ఆగుట్ల పద్మ గతంలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా ఆమెపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయినా తీరు మార్చుకోకుండా బైండోవర్ ఉల్లంఘించి మళ్లీ నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. దీంతో తహసీల్దార్ సుజాత ఎదుట హాజరు పర్చగా పద్మను రెండు సంవత్సరాల జైలుశిక్ష కోసం రిమాండ్‌కు పంపాలని ఆదేశించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు ఆమెను ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

ఐచర్‌వ్యాన్, బైక్ ఢీ

భీమారం: మంచిర్యాల -చెన్నూరు జాతీయర హదారిపై భీమారం సమీపంలో జోడు వాగుల మూలమలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్వేత తెలిపిన వివ రాల ప్రకారం... చెన్నూరు నుంచి మం చిర్యాల వైపు వెళ్తున్న బైక్ మంచిర్యాల నుం చి చెన్నూరు వైపు వెళ్తున్న ఐచర్‌వ్యాన్‌లు ఎదు రెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్ పై ప్రయా ణిస్తున్న మంచిర్యాలకు చెందిన ఆఖీల్‌ఖాన్, మధుకర్‌లకు బలమైన గాయాలయ్యాయి. మూలమలుపు వద్ద అధికవేగంతో వెళ్లడంతో ప్రమాదం జరిగిందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [G-169]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

యువతకు బాసట

- రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టిన సర్కారు
- రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు సబ్సిడీ రుణాలు
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



సిరికొండ: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేస్తున్న యువకులు

నిర్మల్‌చైన్‌గేట్/సిరికొండ: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. స్వయం ఉపా ధి యూనిట్లు నెలకొల్పుకొని తమ కాళ్లపై తాము నిలబడి తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చుకు నేందుకు యువతకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించిం ది. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఈ పథకం అమలు చేయనున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 4,200 మందికి ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందించనున్నారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,600 మంది యువతీ, యువకులకు ఈ పథకం కింద లబ్ధిచేకూరనుంది.

మూడు కేటగిరీల్లో ఆర్థిక సహాయం..

కేటగిరీ- 1, 2, 3 వారీగా యువతకు ఆర్థిక సహాయం అందించనున్నారు. కేటగిరీ -1 కింద రూ. లక్ష ఆర్థిక సహాయం అందిస్తారు. ఇందులో 80 శాతం సబ్సిడీని ప్రభుత్వం సమకూర్చుతుంది. 20 శాతం నగదును లబ్ధిదారులు సమకూర్చు కోవాల్సి ఉంటుంది. కేటగిరీ -2 కింద రూ. లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఆర్థిక సహాయం అం దిస్తారు. ఇందులో 70 శాతం సబ్సిడీ ఇవ్వనుండగా మిగితా 30శాతం లబ్ధిదారులు సమకూర్చుకోవాలి. కేటగిరీ 3 కింద రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తారు. ఇందులో 60 శాతం ప్రభుత్వమే సబ్సిడీ సమకూర్చనుండగా లబ్ధిదారులు 40శాతం భరించాల్సి ఉంటుంది. కేటగిరీ -1 కింద సహాయం పొందదల్చుకున్న వారు రూ. 20వేలు, కేటగిరీ -2 కింద సహాయం పొందదల్చుకున్నవారు రూ. 30వేల వరకు, కేటగిరీ 3 కింద సహాయం పొందదల్చినవారు రూ. 40వేల వరకు తమ వంతు పెట్టుబడిని స్వయంగా కానీ బ్యాంకుల నుంచి కానీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. తెలంగాణ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు తాము నెలకొల ్పదల్చుకున్న యూనిట్లకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పించాల్సి ఉం టుంది. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత సంబం ధిత కార్పొరేషన్లతోపాటు కలెక్టర్ పర్యవేక్షణలో మండల స్థాయిలోని అధికారుల కమిటీ లబ్ధిదారు లను ఎంపిక చేసి తుది జాబితాను ప్రకటిస్తుంది.

మంజూరులో జాప్యం..

గత ప్రభుత్వ హయాంలో రుణాల మంజూరులో జాప్యం జరగడంతో నిరుద్యోగ యువత నిరాశకు గురయ్యారు. అయితే వరుస ఎన్నికలు వచ్చిన స మయంలో ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుం దని ఆశించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రు ణాల మంజూరు ఉంటుందనుకున్నారు. కానీ వరు స ఎన్నికల నేపథ్యంలో రుణాలకు బ్రేక్ పడింది.

ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ..

రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం అమలులో భాగంగా మార్చి 17న దరఖాస్తుల స్వీకర ణను ప్రారంభించింది. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించ నున్నారు. ఆర్థిక సహాయం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీ యువకులు చేస్తున్న దరఖాస్తులను ఏప్రిల్ 6 నుంచి మే 31వరకు పరిశీలించి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని నిర్ణ యించారు.

దరఖాస్తు చేసుకునేందుకు అర్హతలు..

- తెలంగాణకు చెందిన స్థిరనివాసై ఉండాలి.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గానికి చెందిన వారై ఉండాలి.
- నిరుద్యోగ యువతీయువకులకు మాత్ర మే అవకాశం ఉంటుంది.
- ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతాల వివరాలు సమర్పిం చాలి.
- రేషన్‌కార్డు, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ లో పేరు నమోదై ఉండాలి.

బాసరలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజ చేస్తున్న అర్చకులు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలో బ్రహ్మశ్రీ శ్రౌతి రాజేశ్వరి శర్మ -సునీత దంపతులు మహారుద్ర సహిత అష్టోత్తర శత సువాసిని సమారాధన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. శుక్రవారం ఆలయ అర్చకులు, వేదపం డితుల ఆధ్వర్యంలో శ్రీ జ్ఞానసరస్వతి, మహాం కాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అర్చ న పూజలు నిర్వహించారు. అనంతరం గురు ప్రార్థన ఉత్సవ సంకల్పం, 108 మంది బ్రాహ్మ ణోత్తములతో 1331 రుద్ర పారాయణం, 1000 శ్రీ సూక్తాపారాధనలు జరిపించారు. నా ట్యమండలి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యం లో చిన్నారులతో భరతనాట్య ప్రదర్శన నిర్వ హించగా, తొగుట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి హాజరయ్యారు. వీరికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. వివి ధ ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణోత్తములతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నేడు 108 సువాసినీ సమారాధన కార్యక్రమం, స్వామి వారి పాదపూజ మొదలగు కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు శ్రౌతి రాజేశ్వర శర్మ తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో టెక్‌ఫెస్ట్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: బాసర ట్రిపుల్‌టీలో శుక్రవారం అంతఃప్రజ్ఞ టెక్‌ఫెస్ట్, 2025 ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మాన్ని ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ఎ.గోవర్ధన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకత, ఆవిష్కరణలను అన్వేషించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీని దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా మారుస్తామని పేర్కొన్నారు. ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ ఈ టెక్‌ఫెస్ట్ విద్యార్థుల ప్రతిభకు నిలయమని ప్రశంసించారు. ఈసందర్భంగా విద్యా ర్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో ప్రొఫెసర్లు మురళీధర్షన్, రణధీర్ సాగి, విట్టల్, మహేశ్, చంద్రశేఖర్, అజయ్, రాములు, స్వప్నిల్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

యాక్టివిటీ సెంటర్ ప్రారంభం..

బాసర ట్రిపుల్ ఐటీలో యాక్టివిటీ సెంటర్‌ను శుక్ర వారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ పురుషోత్తం, ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ ప్రారంభిం చారు. విద్యార్థుల సంక్షేమం, పాఠ్యేతర కార్యక లాపాలను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలలో ఈ యాక్టివిటీ సెంటర్ మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థి కేంద్రీకృత చొరవల ప్రాముఖ్యతను వివరిస్తూ సమగ్ర విద్య అనుభవాన్ని అందించడంలో విశ్వ విద్యాలయం చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసిం చారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్టూడెంట్ యాక్టివి టీ సెంటర్ అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చే శామని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. విద్యార్థుల నైపు ణ్యాభివృద్ధి, నాయకత్వ అభివృద్ధి, సమాజ సేవను ప్రోత్సహించడం లక్ష్యమని పేర్కొన్నారు.

విద్యార్థులకు వినికిడి పరికరాలు పంపిణీ



వినికిడి పరికరాలు పంపిణీ చేస్తున్న ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగ ణంలో గల ఐటీడీఏ ఆశ్రమ వికాసం ప్రత్యేక పాఠ శాలలో శుక్రవారం ఆకృతి, హైదరాబాద్ సౌజన్యం తో గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా రూ.10 లక్షల విలువ గల వినికిడి పరిక రాలను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక కేబీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్ మండలాల పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలపై సమీక్ష నిర్వహించి, గిరిజన గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగం తీసుకోవాలన్నారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని హ్యాబిటేషన్ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. నీరు లేని గ్రామా లకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఈఈ తానాజీ, డీఈ శివప్రసాద్, డీఎల్ పీవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

'అధికారులు వేధింపులు మానుకోవాలి'



కాసిపేట 1గనిపై నిరసన తెలుపుతున్న కార్మికులు

కాసిపేట: అధికారులు వేధింపులు మానుకోవాలని శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై కార్మికులు మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి నిరసన తెలిపారు. కార్మికుల డిమాండ్ మేరకు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ యూనియన్‌లు నిరస నకు పిలుపునివ్వగా యూనియన్‌లకు సంబంధం లేకుండా కార్మికులు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. అధికారులు కార్మికు లను వేధిస్తూ చార్జ్‌షీట్లు, మెమోలు, సస్పెండ్‌లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ బెల్లంప ల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ నాయకులు భైరి శంక ర్, అఫ్జలోద్దీన్, బానోత్ తిరుపతి, రావుల సతీశ్ వర్మ, కార్మికులు పాల్గొన్నారు.

శిలాజాలు తరలిస్తున్న వాహనం అడ్డగింత



వాహనంలో తరలిస్తున్న శిలాజాలు

వేమనపల్లి: శిలాజాలను తరలిస్తున్న వాహనాన్ని తహసీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డుకు న్నారు. ప్రాణహిత నది తీరంలో వేల ఏళ్ల నాటి నత్త గుల్ల, తాబేలు, చేప ఆకృతిలోని శిలాజరాళ్లు ఉన్నాయి. శిలాజాలను ఎవరో వాహనంలో తరలిం చడం గమనించిన స్థానికులు తహసీల్దార్‌కు సమా చారం అందించారు. వెంటనే ఆయన ఆర్ఐ ఖాలీక్‌ను సుంపుటం సమీపంలో ఉన్న ప్రాణహిత నదికి పంపి తహసీల్దార్ కార్యాలయానికి వాహ నాన్ని తరలించారు. శిలాజాన్ని తీసుకెళ్తున్న వ్యక్తిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను ఆర్కియా లజిస్ట్ శాఖకు చెందిన ఉన్నతాధికారులతో ఫోన్ మాట్లాడించాడు. శిలాజరాళ్లను భద్రపర్చేందుకు తీసుకెళ్తున్నట్లు నిర్ధారించుకుని వాహనాన్ని వదిలిపెట్టారు.

బోరిగాంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ పర్యటన



బోరిగాంలో మాట్లాడుతున్న నాగేశ్వర్ రావు

లక్ష్మణచాంద: తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు మామడ, లక్ష్మణచాంద మండలాల పరిధిలోని బోరిగాం గ్రామంలోని గోదాములను శుక్రవారం సందర్శించారు. ఈ సం దర్భంగా గోదాం నిల్వ సామర్థ్యం, వేబ్రిడ్జి సామ ర్థ్యం, రికార్డుల పరిశీలన చేసి మేనేజర్ శివరామకృ ష్ణకు పలు సూచనలు చేశారు. బీహార్ హమాలీలతో మాట్లాడి వారికి కల్పించిన మౌలిక సదుపాయాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బం దితో కలిసి గోదాంలో మొక్క నాటారు. గోడౌన్‌లో బాగా కష్టపడే వారిని గుర్తించి వారికి తగిన గుర్తిం పు ఇస్తామన్నారు. అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదన్నారు. పర్యటనకు ముందు నిజామాబాద్ రీజియన్ పరిధిలోని మేనేజర్‌లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ కోర్రా లక్ష్మి, జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్.సి శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్, ఆర్ఎం రాజ్యలక్ష్మి, గోడౌన్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



భూమిపూజ చేస్తున్న తిరుపతి

దండేపల్లి: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర గిరిజన అభివృద్ధి సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలం ధర్మరావు పేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు, దండేపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిర మ్మ మోడల్‌హౌజ్ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్ర భుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తుందన్నా రు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీ డీవో ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సతీశ్, నాయకులు రాంచందర్, దుర్గప్ర సాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎండీ సమీపంలోని కాలువలో విద్యార్థి గల్లంతు



అరవింద్ (ఫైల్)

జన్నారం: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఎల్ఎండీ సమీపంలోని కాలువ లో గల్లంతు కావడం తో గ్రామంలో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి. గ్రామ స్తుల వివరాల ప్రకారం చింతలపల్లి గ్రామానికి చెందిన వాసాల లింగన్న, శంకరవ్వల కుమా రుడు అరవింద్ (18) కరీంనగర్‌లోని ఎస్సార్ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతు న్నాడు. ఈనెల 19న స్నేహితులతో కలిసి ఎల్ ఎండీలో సమీపంలోని కాలువలోకి స్నానం కోసం వెళ్లి గల్లంతయ్యాడు. కాగా హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి కేసీ కెనాల్‌లో శుక్రవారం అతని మృతదేహం లభ్య మైంది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తు న్నట్లు యువకుడి బంధువులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



వెంకటి (ఫైల్)

బెజ్జూర్: ఇటీవల మం డలంలోని ఊటపల్లి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదం జరగ్గా తీవ్ర గాయాల పాలైన అందుగుల గూడ గ్రామానికి చెం దిన గేడం వెంకటి(45) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయాలపాలైన వెంకటిని వరం గల్ ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తర లించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృ తి చెందినట్లు మృతుడి భార్య పద్మ తెలిపారు. కుటుంబ పెద్ద దిక్కు మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

కుటుంబ తగాదాల్లో వ్యక్తి మృతి



లక్ష్మణ్ (ఫైల్)



పంచనామా చేస్తున్న సీఐ కుమారస్వామి

భీమిని: మండలంలోని వెం కటపూర్ గ్రామ పంచాయ తీలో కుటుంబ తగాదాల్లో మామ, బావమరిది దాడి చేయడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసు లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటపూర్ గ్రామానికి చెందిన చదువుల లక్ష్మణ్ (35) మద్యానికి బానిస య్యాడు. తరచూ భార్య రోజ అలియాస్ సమతతో గొడవ పడేవాడు. శుక్రవారం కూడా భార్యతో తీవ్ర స్థాయిలో గొడవపడ్డాడు. ఈక్రమంలో రోజ తండ్రి పార్వతి రాజేశం, తమ్ముడు పార్వతి అనిల్‌లు లక్ష్మణ్‌పై దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలైన లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమారస్వామి, ఎస్సై గంగారాం తెలిపారు.

పిచ్చికుక్కల దాడి.. చిన్నారులకు గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామం లో పిచ్చికుక్క ఇద్దరి చిన్నారులను గాయపర్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మరికంటి రుద్రాన్స్, అలిశెట్టి నిత్యాన్స ఇ ద్దరు చిన్నారులు శుక్రవారం ఇంటి ముందు ఆడు కుంటుండగా పిచ్చికుక్క వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. చిన్నారులు కేకలు వేయడంతో వెం టనే స్థానికులు, త ల్లిదండ్రులు అప్రమత్తమై కుక్కను తరిమేశారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన వివాహిత సోయం వెంకటమ్మ అదృశ్యమైనట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వివాహి త వెంకటమ్మ భర్త క్రిష్ణ కుమార్‌తో గొడవపడి గురువారం మధ్యా హ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతకగా ఎక్కడా లభించలేదు. దీంతో భర్త క్రిష్ణకుమార్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

పంట దిగుబడి రాక రైతు ఆత్మహత్య



లింగన్న(ఫైల్)

తలమడుగు: పంట ఆశిం చిన దిగుబడి రాక, పెట్టు బడి కోసం చేసిన అప్పులు తీర్చేదారి లేక ఓ రైతు ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండ లం సుంకిడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుం ది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మం డలంలోని సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్నకు ఆరు ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఈ ఏడాది పత్తి, కంది పంటలు సాగు చేశాడు. గత రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం లేదు. పెట్టుబడి కోసం గ్రామం లోని గ్రామీణ బ్యాంకులో రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్నాడు. ఇతర ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.2 లక్షల వరకు అప్పు చేశాడు. ప్రభుత్వం ఇటీ వల ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ కాకపోవ డంతో మరింత ఆందోళనకు గురయ్యాడు. కుటుం బ పోషణ భారమై, అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. శుక్రవారం పొలానికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. అక్కడే లింగన్న(48) చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు వంశీ, శరత్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అంజమ్మ తెలిపారు.

వేధింపులు తాళలేక వ్యక్తి..



గుండ్ల ప్రకాశ్ (ఫైల్)

రెబ్బెన: ఇచ్చిన డబ్బులు అడగటమే తన పాలిట శాపంగా మారింది. తీసు కున్న డబ్బులు ఇవ్వకపోగా తనకే డబ్బులు ఇవ్వాలని లేకుంటే కేసులు పెడతానని ఓ వివాహిత మహిళతో పాటు కొంతమంది నాయకులు వేధించడంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గంగాపూర్‌లో చోటు చేసుకుంది. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివ రాల ప్రకారం.. గంగాపూర్ గ్రామానికి చెందిన గుం డ్ల ప్రకాశ్ (53) గంగాపూర్ గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెం దిన గుర్లె సోనీ అనే వివాహిత ప్రకాశ్‌కు మద్యం అలవాటు చేయడంతో పాటు అప్పుడప్పుడూ ప్రకాశ్ వద్ద నుంచి అవసరానికి డబ్బులు తీసుకు నేది. కొన్ని నెలల క్రితం సోనికి ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని ప్రకాశ్ కోరగా నిరాకరించడంతో పాటు తనకే రూ.లక్ష బాకీ ఉన్నావని ఎప్పుడు ఇస్తా వంటూ వేధించింది. డబ్బులు ఇవ్వకుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరింపులకు పాల్పడింది. సోనికి మద్దతుగా గ్రామానికి చెందిన పలువురు నాయకులు డబ్బులు చెల్లించాలంటూ వేధించడంతో ప్రకాశ్ గురువారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. శుక్రవారం తెల్లవారుజామున గమనించిన గ్రామస్తులు బెల్లం పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యు లు పరీక్షించి అప్పటికే ప్రకాశ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రాకేశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ రామ్‌నగర్ ఏరియాకు చెందిన అల్లకొండ శ్రీకాంత్(32) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ స్థానిక ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. డబ్బుల లావాదేవీలకు సంబంధిం చి ముగ్గురు వ్యక్తులు వేధించడంతో భరించలేక తనువు చాలిస్తున్నట్లు సూసైడ్‌నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన జరిగిన సమయంలో ఇం ట్లో ఎవరూ లేరని కుటుంబసభ్యులు శుక్రవారం ఇంటికి వచ్చి తలుపులు తెరిచి చూడగా ఆత్మహత్య ఘటన బయటకు వచ్చిందని ఎస్సై తెలిపారు. కాగా మృతుడి భార్య కరోనా సమయంలో మృ తిచెందగా ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.